న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత జనవరిలో 42 రోజులపాటు నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం కొన్ని డిమాండ్లు ఆమోదించి కొన్ని జీవోలు ఇవ్వడం జరిగిందని, మరికొన్ని జీవోలు పెండింగ్‌లో పెట్టారని, పెండింగ్‌లో పెట్టిన జీవోలను వెంటనే విడుదల చేయాలన్నారు. అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్ ఇచ్చి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమలత, ధనలక్ష్మి, వై.నేతాజీ, దొప్పలపూడి రమేష్‌బాబు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘ ఎన్నికల కన్వీనర్‌గా కొల్లి గిరి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికల వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లి లక్ష్మి గిరిధర రావు(గిరి) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ ఆదేశాలతో జిల్లా స్వర్ణకార సంఘ ఎన్నికలు నిర్వహించుటకు ఎనిమిది మంది సభ్యులతో కమిటీతో కొల్లి లక్ష్మి గిరిధరరావు(గిరి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లి లక్ష్మీ గిరిధర్‌రావును గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికల కన్వీనర్‌గా నియమించి నట్లు ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కుర్లపల్లి రంగా చారి తెలిపారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు కూటమి శ్రేణులు గురువారం పాఠ్య పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. కూట మి శ్రేణులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని, విద్యా ర్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాల న్నారు. విద్య కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కూటమి నాయకులు, పాల్గొన్నారు.

మలేరియా నివారణ మహోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణంలో గురువారం మలేరియా మాసోత్సవాల ర్యాలీ జరిగింది. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బరాయనమ్ పాల్గొని మలేరియా ఒకరి నుండి ఒకరికి సంక్రమి ంచే వ్యాధి మలేరియా పరాన్నజీవి శరీరంలో ఉన్నప్పుడు వస్తుందని ఎనాఫిలస్ దోమ ద్వారా వ్యాపిస్తు ందన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. మాసోత్సవాల ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని కలిసిన సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని వెలగపూడిలోని సచివాలయంలోని కార్యాలయంలో ప్రారంభోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, తెలుగుయువత కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా సంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ విద్యా సంవత్సరం నందు పాఠశాలలు, కాలేజీలు పున: ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను చేరవేసే బస్సులుపై రవాణ శాఖ అధికారులు గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం పేర్కొన్నారు. పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన 15 బస్సులుపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎఫ్సీ లేకుండా తిరుగుతున్న 4 వాహనా లుపై అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్న రెండు వాహ నాలుపై 60 యేళ్ల దాటిన తరువాత కూడా డ్రైవింగ్ చేస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పర్మిట్లు లేని రెండు బస్సులుపై కూడా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని, ఫిట్నెస్ లేని బస్సులను విద్యా సంస్థలవారు రోడ్లపై అనుమతించరాదని డీటీసీ షేక్.కరీం సూచించారు.

21న కాజలో ఏరువాక ఉత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగర పరిధిలోని కాజలో ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన రత్నగర్భ గణపతి ఆలయం వద్ద ఏరువాక ఉత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ పెదకాపులు సింహాద్రి వెంకటరామారెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, చెన్నం శ్రీనివాసరావు, బొమ్ము పిచ్చిరెడ్డి గురువారం తెలిపారు. ప్రతియేటా జ్యేష్ఠ పౌర్ణమి రోజున రైతులు అరకలు కట్టి గ్రామ నడిబొడ్డున గల గణపతి ఆలయం వద్దకు చేరుకుని పూజలు జరపడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. పెదకాపులు ఉత్సవాన్ని జరిపిస్తారు. పూజ అనంతరం ఆలయ నలువైపుల గల స్థంభాలపై నిలబడి భక్తులకు ఉండ్రాళ్లను పెదకాపులు స్వహస్తాలతో పంచిపెడతారు. ఏరువాక ఉత్సవంలో రైతులు, ప్రజలు ఆనందోత్సహాలతో పాల్గొనాలని పెదకాపులు కోరారు. ఏరువాక సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్
- మోకాళ్లపై కూర్చుని నిరసన

విశాలాంధ్ర-గుంటూరు : నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు కొత్తపేట భగత్‌సింగ్ విగ్రహం వద్ద గురువారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బందెల నాసర్ జీ, షేక్‌వలి మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి చెందిన వారు కావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. దీని వెనుక బీహార్‌కు చెందిన ముఠా ఉందని ఆరోపించారు. ఈ ముఠా ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి దొరికిన కూడా వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతున్నా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం ఎన్‌టీఏ విడుదల చేసిన పరీక్షా ఫలితాలపై, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యూజీసీ నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని, మరీ నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని కోరారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని, 24 లక్షల మంది విద్యార్థులకు మళ్ళీ నీట్ పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని లేనిపక్షంలో వారి కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్ వెంకటేశ్వర్లు మృతి

- నివాళులర్పించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ గ్రామ పంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్న రెడ్డి వెంకటేశ్వర్లు 65 సంవత్సరాలు గురువారం వేకువ జామున మృతి చెందాడు. 20 సంవత్సరాలుగా పంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. వర్కర్లకు ఏఐటీయూసీ నాయకుడిగా ఉన్నాడు. బక్రీద్ రోజున గ్రామంలోని ముస్లిం కాలనీలో పని చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. రెండు రోజులుగా అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి ముగ్గురు కుమారులు, విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.అరుణ కుమార్, మేడా హనుమంతరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు వెంకటేశ్వర్లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జంగాల అజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నాయకులు ఖమ్మం పాడు దేవునిదయ, రేపూడి శ్రీనివాసరావు, గుర్రంకొండ సత్యానందం, పంచాయతీ వర్కర్లు నూతక్కి వీరయ్య, బొబ్బిలి చిన్న ముక్కంటి, నూతక్కి సాంబయ్య, పాలేటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి పెమ్మసాని గుంటూరు రాక

- ఎన్డీయే కూటమి శ్రేణులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు

విశాలాంధ్ర-గుంటూరు : ఇటీవల కేంద్ర గ్రామీణా భివృద్ధి, కమ్యునికేషన్ల శాఖల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిం చిన గుంటూరు ఎంపీ పెమ్మ సాని చంద్రశేఖర్ శుక్ర వారం తొలిసారి గుంటూరు రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కాజా టోల్‌గేట్ వద్ద ఎన్డీయే కూటమి శ్రేణులు పెమ్మసానికి స్వాగతం పలకనున్నారు. అనంతరం ర్యాలీగా గుంటూరు నగరంలోకి ప్రవేశిస్తారు. ఆటోనగర్, బస్టాండ్, జిన్నాటవర్, హిందూ కళాశాల కూడలి, శంకర్ విలాస్, లాడ్జిసెంటర్ మీదుగా అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీ కన్వెన్షన్ వద్దకు ర్యాలీ చేరుకోనుంది. శ్రీ కన్వెన్షన్‌లో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో జరిగే ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని పాల్గొననున్నారు.

మీరావలిని పరామర్శించిన జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-తుళ్లూరు : ఇటీవల ఆటో రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఏఐటీయూసీ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు షేక్ నాగూల్ మీరావలిని సీపీఐ నేతలు గురువారం పరామర్శించారు. మీరావలిని పరామర్శించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, సంఘం జిల్లా నాయకులు గుర్రంకొండ సత్యానందం తదితరులు ఉన్నారు.

రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తికి లోకేష్ హామీ

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి 17వ వార్డు, 13వ సచివాలయంలో ధోబీకానా స్థలంలో నిర్మాణంలో ఉన్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణమును త్వరలో పూర్తి చేయుటకు మంగళగిరి శాసనసభ్యులు, ఐటీ, ఎలక్ట్రికల్-కమ్యూని కేషన్ శాఖా మంత్రి నారా లోకేష్ హామీ ఇవ్వడం హర్షణీయ మని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ ద్వారా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ప్రజాదర్బార్‌లో జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్-కం-ఇస్త్రీదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాగోలు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, తాడేపల్లి నగర అధ్యక్షులు మొరతోటి సుబ్బారావు, జిల్లా సంఘం నాయకులు వల్లభాపురం మస్తాన్‌రావు, కొత్తపల్లి శ్యామ్, ప్రాతూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీఓ 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ జీఓ వలన ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమై పాఠశాలల్లో విద్యార్థులు లేక బడి ఈడు గల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్ళుతున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాద యాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్‌తో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. బోధనకు ఆటంకంగా యాప్స్‌ను రద్దు చేయాలన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు సతీ మణి, ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్ నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, మహిళలకు పంచి పెట్టారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్‌గా వేల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు హెరిటేజ్ సంస్థను విజయపథంలో నడిపి వ్యాపారరంగంలో మహిళలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, నియోజకవర్గ, పట్టణ, మండల మహిళ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రెండు కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-తెనాలి : గుంటూరు జిల్లా యస్పీ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన దిశగా చర్యలు చేపట్టినట్లుగా తెనాలి 2టౌన్ సీఐ ఎ.సుధాకర్ తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలి వి.యస్.ఆర్. & ఎన్.వి.ఆర్. కాలేజ్ వద్ద నన్నపనేని వెంకట్రావునగర్ ముఖద్వారం వద్ద గంజాయి అమ్మిన వారిని, కొంటున్న వారిని అరెస్టు చేసి వారి దగ్గర నుండి 2కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నామన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ చుట్టుప్రక్కల గంజాయిని అధికంగా అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. 2టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసినట్లు తెలిపారు. తెనాలి డీఎస్పీ యం.రమేష్ మాట్లాడుతూ ఎంతో చాకచక్యంతో గంజాయి నేరస్తులను పట్టుకున్నందుకు తెనాలి 2టౌన్ సీఐ సుధాకర్‌ను, వారి సిబ్బంది మహమ్మద్ హనీఫ్, అంకయ్య, సాంబశివరావు, వెంకటప్రసాద్, దేవదాసు, గణేష్‌లను అభినందించి వారికి రివార్డ్స్ ప్రకటించారు.

రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు వెంటనే ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సహాయాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. గురువారం మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల రైతు సంఘం అధ్యక్షులు జి.బాబు వరప్రసాద్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య తన ప్రసంగానికి కొనసాగిస్తూ దేశ వ్యాప్తంగా రైతాంగం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతాంగ వ్యతిరేక విధానాలపై చేసిన పోరాట ఫలితంగానే బీజేపీకి సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గాయని అన్నారు. గుంటూరు ఛానల్‌లో ఉన్న టూతుకాడ, గుర్రపు డెక్కు తొలగించాలని కోరారు. పెదవడ్లపూడి హై లెవెల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమా ండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన రైతాంగ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ వద్ద వినతి పత్రం అందజేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం మంగళగిరి మండల కార్యదర్శి బి.ప్రసాద్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎం.పకీరియా, ఏ.సామ్ రెడ్డి, కె.మాధవరెడ్డి, ఏ.ప్రకాష్ రావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల సందర్శనకు ఎన్‌సీసీ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్(ఐబిఎస్.బి) రెండు చొరవలో భాగంగా కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న ఎన్‌సీసీ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో బాగంగా ఏపీ, తెలంగాణా రాజస్థాన్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లకు చెందిన క్యాడెట్‌లు విజయవాడలోని అనేక ముఖ్యమైన సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను చూడడం కోసం గురువారం స్థానిక వడ్డేశ్వరంలోని కేఎల్ శిక్షణా శిబిరం వద్ద నుంచి బయలుదేరి వెళ్లారు. కేఎల్ యూనివర్సిటీ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కేఎల్‌యూ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో బాగంగా రాజస్థాన్, తెలంగాణాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి కేఎల్ వర్సిటీలో శిక్షణకు వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు విజయవాడలోని కనకదుర్గ దేవాలయం, సామాజిక న్యాయం విగ్రహం, ఉండవల్లి గుహలను సందర్శించేందుకు కేఎల్ వర్సిటీ నుంచి తరలివెళ్లారని అన్నారు. ఈ సందర్శన వలన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు భారతదేశ విభిన్న సాంస్కృతిక వారసత్వంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్యాడెట్ల మధ్య ఐక్యత అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి నాక్ ఏ ప్లస్ గ్రేడ్

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దేశంలోనే నాక్ అక్రిడేషన్ డ్యూయల్ మోడ్‌లో వెళ్లిన తొలి విశ్వవిద్యాలయంగా నిలిచింది. ఈ విశ్వవిద్యాలయానికి నాక్ కౌన్సిల్ ఏ ప్లస్ గ్రేడ్‌ను 3.46 సీజీపీఏతో కేటాయించడం జరిగింది. ఈ మేరకు గురువారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ విశ్వవిద్యాలయంలోని అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులతో ప్రత్యేక అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి 26వ తేదీ వరకు విశ్వవిద్యాలయం నాక్ 4వ సైకిల్‌కు వెళ్లిందని మూడు రోజులు కమిటీ పర్యటన అనంతరం నాక్ గ్రేడ్‌ను కౌన్సిల్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు. నాక్ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం కౌన్సిల్ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించిందని వివరించారు. వర్సిటీ 3.08 సీజీపీఏతో ఏ గ్రేడ్‌లో కొనసాగుతుందని ప్రస్తుతం జరిగిన 4వ సైకిల్‌లో 3.46 సీజీపీఎస్ సాధించి ఏ ప్లస్ గ్రేడ్ పొందినట్లు వీసీ పేర్కొన్నారు. కేవలం 0.05 పాయింట్ల తేడాతో ఏ డబుల్ ప్లస్ మిస్ అయిందని వివరించారు. ర్యాంకు సాధనకు కృషి చేసిన అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు అందరినీ అభినందిస్తూ సెక్యూరిటీ గార్డు స్థాయి నుంచి రెక్టర్ స్థాయి వరకు ప్రతిఒక్కరికి అభినందనలు తెలియజేశారు. ర్యాంకు సాధనలో నిరంతరం కృషిచేసిన నాక్ వర్సిటీ కమిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపి కృష్ణలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్టర్ ప్రొఫెసర్ బి.కరుణ, నాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ స్వరూప రాణి, ప్రొఫెసర్ గంగాధర్ రావు, ప్రొఫెసర్ సిద్దయ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, సీడీసీడీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్.ఉదయ్ కుమార్, ఇతర విభాగాల కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ని సన్మానించిన వేములకొండ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ మంగళగిరిలో భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించిన నారా లోకేష్‌ని గురువారం ఉండవల్లిలోని వారి స్వగృహంలో కలిసి దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలందరూ టీడీపీకి మద్దతిచ్చి నారా లోకేష్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నారని అన్నారు. గత అయిదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నా సేవా కార్యక్రమాలతో యువనేత నారా లోకేష్ మంగళగిరి ప్రజల మనసు గెలిచారన్నారు. గత వైసిపి పాలనలో జగన్‌రెడ్డి తన సామాజికవర్గ నాయకులకే ప్రాధాన్యతనిచ్చారు. బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసి వారి కళ్లనీళ్లు తుడవడానికి నిధులు విధులు లేని చైర్మన్ పదవులు ఇచ్చారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీల అభివృద్ధిని జగన్‌రెడ్డి అణచి వేసి కేవలం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నందుకు ప్రతి ఫలంగా బీసీలు వైకాపాను 11 స్థానాలకే పరిమితం చేసారు. ఈరోజున క్యాబినెట్‌లో అత్యధికంగా కీలకమైన మంత్రి పదవుల్లో బీసీ నాయకులు కొలువు తీరారంటే అది తెలుగుదేశం పార్టీ.. నారా చంద్రబాబు పుణ్యమేనని అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా మరోసారి బీసీకి పట్టం కట్టడం, పార్టీని అభివృద్ధి పథంలో నడిపే దిశగా బీసీలు కృషి చేస్తారని చంద్రబాబుకి బీసీలపై ఉన్న ప్రేమను మరోసారి నిరూపించుకున్నారు. రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో కూడా బిసిలకు పెద్దపీట వేసి బీసీల ప్రభుత్వమని నిరూపించుకుంటా మని నారా లోకేష్ తెలిపారు.

మంత్రి కొలుసు పార్థసారథికి అభినందనలు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసార థిని గురువారం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ టీడీపీ నాయకులతో కలిసి బొకే అందచేసి అభినం దనలు తెలియజేసారు. సుందం రావు యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పదవి కొలుసు పార్థసారథికి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ ంలో డాక్టర్ శశిధర్, డాక్టర్ శ్రీధర్, నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రెటరీ తాడిబోయిన భాస్కర్, జి.చంద్ పాల్గొన్నారు.

ముగిసిన 'సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా తరగతులు

- ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు మెడికల్ కాలేజీ నందలి ఎస్పీఎం గ్యాలరీలో, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలకు రెండవ విడత మూడు రోజులు పాటు జరిగిన "సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజులు పాటు జరిగిన శిక్షణా తరగతులో నేర్చుకున్న విషయాలను ఆగస్టు మాసములో జరగబోయే ఇంటింటి సర్వేలో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించిన ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకెళ్ళి గృహ సందర్శనలో ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలకు అనుగుణంగా..అనుమానాస్పద క్యాన్సర్ కేసులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని ఆదేశించారు. అక్కడ వైద్యాధికారి వారిని పరీక్షించి, అవసరాన్ని బట్టి అనుమానాస్పద కేసులను, తృతీయ శ్రేణి ఆసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన కేసులకు చికిత్స చేసి తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, శిక్షకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ హేమంత్, డాక్టర్ తేజ, డెంటిస్ట్, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనూష, ఎన్‌సీడీ కన్సల్టెంట్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

మంత్రి సవితని మర్యాదపూర్వకంగా కలసిన మద్దిరాల గంగాధర్

విశాలాంధ్ర-పెదకూరపాడు: బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితని తెలుగు దేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం సవిత గంగాధర్‌తో మాట్లాడుతూ నీకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుంఎన్నారు. అన్ని సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తుందని ఆమె అన్నారు.

బాలకృష్ణను కలిసిన బ్రహ్మారెడ్డి

విశాలాంధ్ర-మాచర్ల: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గం లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎన్నికల రోజున ఎన్నికల అనంతరం జరిగిన గొడవల గురించి బాలకృష్ణ ఆరా తీశారు. నియోజకవర్గ అభివృద్ధిపై తీసుకోవలసిన పలు అంశాలపై వారిద్దరూ చర్చించారు. మాచర్ల నియోజక వర్గం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి తెలిపారు.

దేవాలయాల్లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి రూరల్ మండలం గర్నెపూడి గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, చర్చిలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజలో సత్తెన పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గురువారం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి, స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ ఆహారాల పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కల్తీ ఆహారాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి హెచ్చరించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ ఆహారాలతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, ఏది కొనాలన్నా..తినాలన్నా భయపడే రోజులు వచ్చాయన్నారు. తమ వ్యాపారం పెంచుకునేందుకు ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న వారితో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కల్తీ ఆహారం వల్ల దీర్ఘకాలంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అలాగే జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దారితీస్తుందని, వీలైనంత వరకూ రోడ్డు పక్కనే ఆహారాలు తినకపోవటమే మంచిదన్నారు. కల్తీ ఆహారం వల్ల ఆసుపత్రులు కూడా నిండిపోతున్నాయని, ఆహార పదార్థాలుపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మొత్తంలో నామమాత్రపు సొమ్మునైనా కల్తీ నియంత్రణ, నిరోధానికి ఖర్చుపెట్టటం లేదన్నారు. కల్తీ వస్తువులు విక్రయించే వారిపై దాడులు తూతూమంత్రంగానే కొనసాగుతున్నాయని దుయ్యబట్టారు. కల్తీపై ప్రచారం విస్తృతం చేయాలని, వాటి పట్ల జరిగే కీడును ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఆరోగ్య తనిఖీ అధికారుల సంఖ్య, వారి అధికారాలు పెరగాలన్నారు. కల్తీ చేసిన వారికి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

శరణార్థుల పట్ల మానవత్వంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తమ తప్పు లేకున్నా బలవంతంగా అమాయక ప్రజలు యుద్ధాలు.. తీవ్ర సంక్షోభాలు, హింసాత్మక ఘటనలు..ప్రకృతి వైపరీత్యాల కోరల్లో చిక్కి తమ స్వస్థలాలు వదిలి ప్రాణ రక్షణకై వలస వెళుతున్నారని, అటువంటి శరణార్థుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని న్యాయవాది, విశ్లేషకులు అవధానుల హరి కోరారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'శరణార్థులను అక్కున చేర్చుకుందాం' అనే అంశంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అవధానుల హరి మాట్లాడుతూ ప్రతి నిమిషానికి ప్రపంచ వ్యాప్తంగా 20 మంది ప్రజలు శరణార్థులుగా తమ నివాసాలు వదిలి ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ఇతర ప్రాంతాలు, దేశాలకు వలస వెళుతున్నారన్నారు. 2018 లెక్కల ప్రకారమే ప్రపంచ వ్యాప్తంగా 70.8 మిలియన్ల శరణార్థులు ఉన్నారని, నేడు భీకరంగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్, ఇశ్రాయిల్-పాలస్తీనా యుద్ధాల వల్ల నేటికి దాదాపు 10 మిలియన్ల శరణార్థులు పొరుగు ప్రాంతాలకు వలస వెళుతున్నట్లు ఆయన చెప్పారు. విద్యావేత్త ఎస్.రవిబాబు మాట్లాడుతూ శరణార్థులు విద్య, వైద్యం, కనీస అవసరాలు లాంటి వసతులకు బహు దూరంగా బతకటం గమనించిన ఐక్యరాజ్య సమితి 2021 జూన్ 20న 50వ శరణార్థుల సదస్సు ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్యే

■ ఎమ్మెల్యే చదలవడ అరవిందబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావుపేటలో ప్రతి ఎకరాకు సాగునీవ్వాలి, ప్రతి రైతుకు ప్రభుత్వ సాయం అందాలన్నదే తన లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించారు. 2019లో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని నాశనం చేశాడు. చివరికి వందలాది ఎకరాల్లో పొలాలు, పంట కాలువలు, డొంక రోడ్లు, చెక్ డ్యాములు కబ్జా చేసి లే అవుట్లు వేసుకున్నారన్నారు. ప్రజల ఆస్తుల్ని, ప్రభుత్వ ఆస్తుల్ని కూడా ఎమ్మెల్యే కనుసన్నల్లో కొంత మంది వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారన్నారు. ఆక్రమణకు గురైన ప్రతి గజం భూమినీ అర్హులకు అందించాలన్నారు. డాక్టర్ కొడుకు డాక్టర్,ఇంజనీర్ కొడుకు ఇంజనీర్ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్న విధంగా..రైతు బిడ్డ రైతు అవుతానని కాలర్ ఎగరేసి చెప్పే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. రైతుల పొలాలు ఆక్రమణకు గురవ్వడంతో ప్రభుత్వం నుండి అందాల్సిన సదుపాయాలు అందకుండా పోతున్నాయి అని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత నా పై ఉందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో అనుసరిస్తున్న విధానాలను కూడా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతు ప్రభుత్వాల పై ఆధారపడే పరిస్థితి పోవాలని, ప్రభుత్వమే రైతులపై ఆధారపడే పరిస్థితి రావాలన్నారు. గత ఐదేళ్లుగా పంట నష్టపరిహారం కూడా సరిగా ఇవ్వలేకపోయారు, ప్రజలు రోడ్డెక్కి ధర్నాలు చేసినా విత్తనాలు, ఎరువులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేశారన్నారు. మరోవైపు పూడుకుపోయిన కాల్వల్ని మరమ్మతు చేయకుండా అవస్థలకు గురి చేశారన్నారు. రైతులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి అవసరమైన ప్రతి వస్తువూ అందించి తోడుగా నిలుస్తుందన్నారు. వచ్చే ఐదేళ్లలో నియోజక వర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు డా.చదలవాడ అరవింద బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిన్నెల్లి బెయిల్ పిటీషన్‌పై తీర్పు రిజర్వు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంతకం చేసి వెలుతున్న పిన్నెల్లి

విశాలాంధ్ర-నరసరావుపేట: గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎంల ధ్వంసం సహా పలు కేసుల్లో షరతులతో కూడిన హైకోర్టు బెయిల్‌పై బయట ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటీషన్‌పై గురువారం హైకోర్టులో వాదనలు పూర్తి అయ్యాయి. న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. ఈ మేరకు తీర్పు వెలువడే వరకు ఆయన అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల గడువును పొడిగించారు. తీర్పు వెలువడే వరకు ఆ ఉత్తర్వులు అమలులో ఉంటాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి గత నెలలో హైకోర్టు మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్ మంజూరు మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోనే పోలీసుల కనుసన్న లో ఉంటూ, ప్రతి రోజు ఎస్పీ కార్యాలయంలో సంతకం చేస్తున్నారు. పిన్నెల్లి బెయిల్ పిటీషన్ వాదనలు పూర్తి కావడంతో ఆయనకు జైలా, బెయిలా అనే ఉత్కంఠ నియోజకవర్గ ప్రజల్లో నెలకొంది.

భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరాన్ని సందర్శించిన ఎంపీ లావు

విశాలాంధ్ర-మంగళగిరి : నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలు పెదవడ్ల పూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరమునకు విచ్చేసిన సందర్భంగా గురువారం ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ పాతూరి నాగభూషణం ఆలయ సాంప్రదా యంలో ఆహ్వానము పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి మెమెంటో ఇచ్చి సత్కరించారు. అనంతరం ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు పెద్దకర్మ సందర్భంగా ఆలయంలో అన్నదాన భవనంలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. గోమాత గోశాలను దర్శించి ఆవులకు దానా పెట్టారు. ఆలయ కమిటీ కార్యదర్శి తెలుగుదేశం నాయకులు పాతూరి శ్రీనివాస రావు, గ్రామ తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి పట్టణంలో గురువారం 9,11 వార్డులలో మున్సిపల్ కమీషన్ బి.శేషన్న పర్యటించారు. శానిటేషన్ గురించి ప్రజల ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంతరం శానిటేషన్ కార్మికులు వర్షాల సమయంలో మరీ ఎక్కువగా బాధ్యతలు తీసుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు తదితర సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి స్వాగతం పలుకుదాం

– జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారి గుంటూరు నగరానికి విచ్చేస్తున్న గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ అరంగేట్రంలోని తొలి అడుగుతోనే పెమ్మసాని నవ శకానికి నాంది పలికారన్నారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరువకుండా మాతృభూమి రుణం తీర్చుకునేందుకు పెమ్మసాని ప్రజా జీవితంలోకి రావటం ఎంతో ముదావహం అన్నారు. రాజకీయ రంగ ప్రవేశానికి ముందే ప్రజల జీవన విధానంపై, పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలపై పూర్తి స్థాయిలో ఆయన అధ్యయనం చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలతో ప్రధానంగా పేద, సామాన్య ప్రజలతో మమేకమయారన్నారు. పార్లమెంట్ సభ్యుడిగానే కాకుండా కేంద్రమంత్రిగా పెమ్మసాని లాంటి నాయకుడు దొరకటం గుంటూరు జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆళ్ళ హరి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏఎన్‌యూ వద్ద నున్న టోల్ ప్లాజా నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా గుంటూరు ఆటో నగర్, ఆర్టీసీ బస్టాండ్, జిన్నా టవర్ సెంటర్, హిందూ కళాశాల కూడలి, ఏసీ కళాశాల, శంకర్ విలాస్, లాడ్జి సెంటర్, అమరావతి రోడ్డు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌కు చేరుకుంటుందన్నారు.

పవర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పెరుమాళ్ళ మునెయ్య

విశాలాంధ్ర-మాచర్ల: పవర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పెరుమాళ్ళ మునెయ్య ఎంపికయ్యారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు న్యాయవాది జి జయనందరావు చేతులమీదుగా గురువారం నియామక పత్రాన్ని అందుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పెరుమాళ్ళ మునెయ్య మాట్లాడుతూ సమాజంలో పేదలను గుర్తించి వారికి ఆర్థిక సాయంతో పాటు నిత్యవసర సరుకులను అందజేయడమే సంస్థ లక్ష్యమన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన న్యాయవాది జి.జె రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం అందుబాటులో ఉండి రాష్ట్రవ్యాప్తంగా ఫౌండేషన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మునెయ్యను ఎర్రగొర్ల సాంబశివరావు యాదవ్, గోగుల రాజు యాదవ్ అభినందించారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన జాస్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో శంఖు స్థాపన చేసిన ప్రాంతాన్ని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస సముదాయాలు, ఇతర బిల్డింగ్‌లను, రోడ్లను పరిశీ లించేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ జాస్తి వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 5 సంవత్సరాలుగా జగన్ రెడ్డి ప్రభుత్వంలో అమరావతిని సర్వనాశనం అయ్యిందని ఆవేదన వ్యక్తంచేశారు. అమరావతిని ధ్వంసం చేసి రాజధాని రైతులకే గాక రాజధానిలో ఉన్న రైతు కూలీలు, ఆడ పడుచులను నానా యాగీ చేశారన్నారు. రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మందికే గాక ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగు వారికి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి ఒక్క చంద్రబాబు నాయుడుకే సాధ్యమని నమ్మబలికిన నేపథ్యంలోనే ఎన్డీయే కూటమిని భారీ మెజారిటీతో విజయాన్ని అందించినట్లు చెప్పారు. దేవతల రాజధాని అమరావతి భవిష్యత్తులో ప్రపంచంలోనే మేటి నగరంగా రూపుదిద్దుకుంటుందని, అది ఒక్క చంద్రబాబు నాయుడు విజన్‌తోనే సాధ్యమన్న ఆశాభావం ఆయన వ్యక్తంచేశారు.

మండుతున్న ఎండలు-వడగాల్పులు

- అల్లాడుతున్న ప్రజలు
- కొండెక్కిన కూరగాయల ధరలు

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రంలో ఈ నెల మొదటి వారంలో రుతుపవనాలు ప్రవేశించి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆహ్లాదాన్ని పొందారు. రైతులు పొలాల్లో పత్తి, మిర్చి, ఇతర అపరాల పంటలు సాగుకు సమాయత్తమయ్యారు. కాగా జూన్ నెల మొదటి మాసంలో చుట్టంచూపులా వచ్చిన వర్షాలు ఆగిపోయాయి. మళ్ళీ గత వారం రోజులుగా వేసవిని తలపించే ఎండలు ప్రారంభమయ్యాయి. గత రెండు రోజుల నుంచి ఎండలతో పాటు వడగాల్పులు కూడా వీస్తుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇళ్ళ నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇళ్ళలో సైతం ఉక్కపోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల సైతం ఎండలతో బయపడుతున్నారు. పొలాల్లో నాటిన పత్తి, మిర్చి మొక్కలు ఎండ వేడిమికి, వడగాల్పు లకు వాడిపోయి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పొలాల్లో సాగు ప్రారంభించామని ప్రారంభంలోనే ఎండ లతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతు న్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు : ఎండలు, వడగాల్పులతో ఆకుకూరలు, కూరగాయల దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో మార్కెట్లో టమాటాలతో సహా ఇతర కాయగూరలు, ఆకుకూరలు ధరలు మండిపోతున్నాయి. టమాట కిలో ధర వంద రూపాయలు దాటింది. కొత్తిమీర, పుదీన కూరల కట్ట 30 నుంచి 50 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇతర కూరగాయలు అన్ని కిలో 50 రూపాయలు దాటిపోయాయి. దీంతో మార్కెట్లో కూరగాయలు కొనే పరిస్థితి లేదంటూ మహిళలు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కూరగాయల ధరలను అదుపు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. చిత్తూరు జిల్ల మదనపల్లె, ఉంగనూరుల నుంచి అధికారులు టమాటాలు కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా తక్కువ ధరలకు అమ్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసీపీ వేర్లన్నింటినీ కత్తిరించాలి : జీవీ ఆంజనేయులు

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన జీవీ ఆంజనేయులు

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్ర సచివాలయ స్థాయి నుంచి గ్రామ/ వార్డు సచివాలయాల వరకు ప్రభుత్వ వ్యవస్థల్లో తిష్ట వేసిన వైకాపా వేర్లన్నింటినీ కత్తిరించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు. కన్సల్టెంట్‌లు, సలహాదారులు, ప్రత్యేక ఉద్యోగుల పేరిట ఎక్కడబడితే అక్కడ చొరబడినవారంత ఇంతకాలం ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచుకు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారాయన. తన స్వార్థ రాజకీయం కోసం జనం సొమ్ముతో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేసిన ఈ జల్సాలన్నీ పూర్తిస్థాయిలో బయట పెడితే అతడిని ఆ జనమే ఛీకొట్టడం ఖాయమన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ గురు వారం సచివాలయంలో పలువురు మంత్రులను జీవీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి శుభారంభానికి సూచికగా మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీవీ మాట్లాడుతూ సొంత పార్టీ, సొంత ఛానెల్ కోసం పనిచేయించుకుంటూ ప్రభుత్వం నుంచి జీతం పొందేలా దొడ్డి దారిలో నియమించుకున్న ఒక్కొక్క రికీ నెలకు లక్ష, 2 లక్షలు, 3 లక్షల వరకు కూడా జీత భత్యాలు చెల్లించారని, అదంతా ఎవ డబ్బు సొమ్మని ప్రశ్నించారు. తవ్వుతున్న కొద్దీ వెలుగుచూస్తున్న ఈ బాగోతాల పై ప్రజల ముందు పూర్తి వివరాలు ఉంచుతామని, తర్వాత ఈ వైసీపీ, దాని అధినేతను ఏం చేయాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.

రెండో రోజు నేను బడికి పోతా కార్యక్రమం

విశాలాంధ్ర- తెనాలి : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రవేశాలను పెంచేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని గురువారం ఎంఈఓ వి.జయంతి ఆధ్వర్యంలో 2వ రోజు కొనసాగింది. స్థానిక ఇస్లాంపేట హిందూముస్లిం రోడ్డులో బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండే విధంగా బాల బాలికలు అందరినీ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈఓ వి.జయంతిబాబు, సిఆర్ఎంటిలు ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు కలిగిన వయసు పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ జులై 12 వరకు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ సమగ్రశిక్ష మార్గదర్శకాలు విడుదల చేసిందని, ఆరు నుండి 14 ఏళ్లలోపు పిల్లలందరూ బడిలో ఉండేలా 100 శాతం పాఠశాల ప్రవేశం ఉండేలాగా క్యాంపైన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.జయంతి బాబు, ఎంఈఓ ఆఫీస్ స్టాఫ్, మస్తాన్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులపై అవగాహన

విశాలాంధ్ర-దుర్గి: కౌలు రైతులు సీసీఆర్సి కార్డ్ కలిగి ఉండటం వలన పలు ఉపయోగాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి అన్నారు. గురువారం రెవిన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఓబులేశునిపల్లె గ్రామ సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన సీసీఆర్సి పై కౌలు రైతులకు అవగాహన గ్రామ సభలో ఆయన మాటా దారు. అర్హులైన కౌలు రైతులు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ గాని, హార్టికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి, సంబంధిత పత్రాలను అందించి, రిజిస్ట్రేషన్ చేయిం చుకుని సీసీఆర్సి కార్డులు పొందాలని కోరారు. కౌలు రైతు గుర్తింపు కార్డు వలన సబ్సిడీపై విత్తనాలు, పంట నమోదు, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను అమ్ముకోవచ్చునని, బ్యాంకుల ద్వారా పంట రుణం పొంద వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో మేరుగ కిరణ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆర్ కళ్యాణ్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి అనగానిని కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనగాని సత్యప్రసాద్‌ని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పెదకూరపాడు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారని ప్రవీణ్ తెలిపారు.

రెంటాలలో టమోట పంట ధ్వంసం

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని రెంటాలలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు టమోటా పంటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన ఘటనా వివరాలిలా ఉన్నాయి. పెద్దకోట్ల నరేంద్ర నెల క్రితం రెంటచింతల నర్సరీ నుంచి టమోటా మొక్క రూపాయి చొప్పున కొనుగోలు చేశారు. సుమారు 20 వేల మొక్కలు నాటారు. పొలం సాగు చేయటం, కూలీల ఖర్చు కలిపి సుమారు రూ.50 వేల పెట్టుబడి పెట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు మొక్కలను ధ్వంసం చేసినట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు వివరించారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తాడేపల్లిలోని సీఎం నివాసం ఉండవల్లిలో సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అన్ని సచివాలయాల సెక్రటరీలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తగు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రారిశుధ్య పనులను ప్రతి రోజూ క్రమం తప్పకుండా చేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా రోడ్లను, వీధులను, డ్రెయిన్‌లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై ఎటువంటి ఆక్రమణలు జరుగకుండా ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, రోడ్లపై అనధికారంగా ఎటువంటి తాత్కాలిక నిర్మాణాలు, ఇసుక, కంకర, ఇటుక, డెబ్రిస్‌లను రోడ్డుపై వేయకుండా, రోడ్లపై అక్రమంగా తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు వంటి వాటిని ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్టూడెంట్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నందుకు విద్యార్థులు గర్వపడాలని అన్నారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, మరిన్ని వసతులను కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికీ రూ.35 వేలు చొప్పున ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, నోట్స్‌లు, బ్యాగు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, డిక్షనరీలతో కూడిన కిట్‌ను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ప్రతి ఇంట్లో ఎంత మంది విద్యార్థులు చదువుతుంటే అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల బాటపట్టాలని సూచించారు. చదువుతున్న విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసే సరికి ఏదో ఒక రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించునే విధంగా ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన కోసం మిగిలి ఉన్న అన్ని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి శైలజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరూ ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని విద్యారంగంలో అభివృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ చిష్టీ, డీవైఈవో పి.వెంకటే శ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈవోలు పి.వెంకటేశ్వం రావు, నాగేంద్రమ్మ, హెచ్‌ఎంలు బి.విజయలక్ష్మి, బీవీ రమణయ్య, సిద్దిక్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.